# కోడి కూసినప్పుడు
# (మత్తయి 26:31-75)

పల్లెటూరులో జీవించే ప్రతి ఒక్కరు కోడి కూతను వినే ఉంటారు- గర్వంగల ఆ పక్షి తన మెడను చాచి, పూర్తి ఎత్తుకు లేచి, అరుణోదయాన్ని ఆహ్వానించే ఆ దృశ్యాన్ని వారు చూచే ఉంటారు. కోడిపుంజు ఎందుకు అలా చేస్తుందో నాకు తెలియదు. బఠాణి పరిమాణంలో ఉండే తన మెదడులో, తాను కూయకుంటే సూర్యుడు రాడనే నమ్మకం తనకుందేమోనని నా అనుమానం.

బాలుడనై యున్నప్పుడు, మిళితమైన ఉద్వేగంతో కోడి కూతను నేను విన్నాను. అది నూతన దిన ప్రారంభాన్ని సూచిస్తుంది. అది మంచిది. నేను వెచ్చగా నున్న పరుపుమీదనుండి లేచి, క్రిందికి దిగి ఆయా పనులను చేసే సమయమాసన్నమైనట్టు అది సూచిస్తుంది. అది అంత మంచిగాలేదు.

మానవ చరిత్రలో కోడికూత ఒకనికి ఏ విధమైన సంతోషాన్ని సమకూర్చలేదు సరిగదా, అది కేవలం భయంకరమైన మనో దుఃఖాన్నే కలిగించింది. అతని పేరు పేతురు ఆ విషాధ గాథయొక్క ముగింపు మత్తయి 26:73-75లో కన్పిస్తుంది.

> కొంతసేపైన తరువాత అక్కడ నిలిచియున్నవారు పేతురు నొద్దకు వచ్చి - నిజమే, నీవును వారిలో ఒకడవే; నీ పలుకు నిన్నుగూర్చి సాక్ష్యమిచ్చు చున్నదని అతనితో చెప్పిరి. అందుకు అతడు - ఆ మనుష్యుని నేనెరుగనని చెప్పి శపించుకొనుటకును ఒట్టు పెట్టుకొనుటకును మొదలు పెట్టెను. వెంటనే కోడికూసెను. కనుక-కోడి కూయక మునుపు నీవు నన్నెరుగనని ముమ్మారు చెప్పెదవని యేసు తనతో అనిన మాట పేతురు జ్ఞాపకమునకు తెచ్చుకొని వెలుపలికి పోయి సంతాపపడి యేడ్చెను.

ప్రభువును ఎరుగనని పేతురు అన్న సంఘటనను చదువుతూ, కోడికూతను ప్రత్యేకంగా చూద్దాం. మన పాఠ్యభాగానికి మత్తయి 26ను ఉపయోగించుదాం. అయితే ఈ సందర్భంగా చెప్పబడిన మార్కు 14; లూకా 22; యోహాను 18లలో నుండి కూడా కొన్ని వివరాలను తెద్దాం. తొలిగా, పేతురుకు కోడెప్పుడు కూసిందో చూద్దాం; ఆ మీదట మనకు కోడెప్పుడు కూస్తుందో గమనించుదాం.

## పేతురు కొరకు కోడికూసినప్పుడు

### అధికారపూర్వకమైన ప్రకటన, దానికి తెలిపిన ఆక్షేపణ

ప్రభువైన యేసు తన శిష్యులతో కూడా మేడగదిలో ఉన్నారు. ముందు

జరుగబోయే దాన్ని గూర్చి ఆయన ఎరిగినవారై తన శిష్యులను దాని విషయం హెచ్చరించారు. "ముందు హెచ్చరింపబడడం, ముందుగా ఆయుధ ధారులవ్వడమని" చెప్పబడుతుంది. ''నా విషయంలో మీరందరు పడిపోతారన్నట్టు'' ఆయన చెప్ప నారంభించారు (31a వ.). పడిపోతారనే ఈ మాట ''తొట్రిల్లుతారు'' అని అర్థమిచ్చే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడింది. ప్రభువు చెప్పిన మాటల్లో భావమేమంటే - ''తొట్రిల్లి పడిపోవునంతగా మీరు ఈరాత్రి నా విషయమై (అభ్యంతరపడతారు) లేక సిగ్గుపడతారు'' అని!

అప్పుడు ప్రభువైన యేసు జకర్యా 13:7నుండి యిలా ఎత్తి చెప్పారు. ''గొర్రెల కాపరిని కొట్టుదును, మందలోని గొర్రెలు చెదరిపోవును అని వ్రాయబడియున్నది గదా'' (31b వ.). గొర్రెల కాపరిని కొట్టుట అనేది ప్రభువైన యేసు మరణాన్ని సూచిస్తుంది. గొర్రెలు చెదరి పోవడమనేది ఆయన శిష్యులు ఆయన్ను విడిచిపోవడాన్ని తెలుపుతుంది.

ఆయన శిష్యులు తన్ను విడిచి పారిపోతారని వారికి చెప్పుతున్నా, యేసు వారిని ప్రేమించి అంగీకరిస్తున్నారు. 32వ వచనంలో ఆయన పునరుత్థానాన్ని గూర్చి, తిరిగి ఆయన తన శిష్యులతో కలిసియుండడాన్ని గూర్చి - యిలా అన్నారు: ''నేను లేచిన తరువాత మీకంటె ముందుగా గలిలయకు వెళ్లెదను''.

ప్రభువుయొక్క ప్రేమను ఆయన అక్కరను పేతురు విన్నట్టులేడు. తానును, యితర శిష్యులును ప్రభువుని విసర్జించుతారన్న మాటలే విన్నట్టున్నాడు. అయితే దాని నంగీకరించడానికి అతడు సిద్ధపడలేదు. ''అందుకు పేతురు - నీ విషయమై అందరు అభ్యంతరపడినను నేను ఎప్పుడును అభ్యంతరపడనని'' ఆయనతో చెప్పాడు (33 వ.). ''నీది తప్పు; ఈసారి నీవుదాన్ని అందుకోలేకపోయావని" ఉపాధ్యాయునితో తొలిసారిగాని కడసారిగాని చెప్పిన విద్యార్థి పేతురేకాదు!

ప్రభురాత్రి భోజనపు స్థాపన విషయంలో అతడు నిమఘ్నుడైనట్టున్నాడు. ఇతర శిష్యులతోను, ప్రభువుతోను అతడు సహవాసంలో ఉన్నాడు. తాను బలవంతుడనని అనుకుంటున్నాడు! ''అది ఎన్నటికిని జరుగదు'' అని అతడు నిగ్గదీస్తున్నాడు (తన మాటలను బట్టి ప్రభువు తప్పు చెప్పినట్టు పేతురు సూచించాడు).

అయినా, ఆ హెచ్చరికను ప్రభువు తిరిగి చెప్పి, ఈసారి దాన్ని పేతురుకే ఉద్దేశించి: '' - ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పుదువని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను'' (34 వ.). ''కోడి కూయక మునుపు'' అంటే - ''ఉదయం కాక ముందు'' అని అర్థం. మరో విధంగా చెప్పాలంటే - ''ఇక్కడనుండి రమారమి, నాలుగైదు గంటలలో మూడు సార్లు నన్ను ఎరుగనంటావ్'' అని ప్రభువు సూచించారు.

పేతురు అలాటి దాన్ని ఊహించలేకపోతున్నాడు. ఇది అతనికి ఎలా

గుందంటే - నలుపు తెలుపై పోతుంది, పైది క్రిందికౌతుంది; చలి కరిగిస్తుంది, వేడి గడ్డకట్టిస్తుంది - అన్నట్టే! ''- నేను నీతోకూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పను'' అని అతడన్నాడు (35 వ.)! ఇలాటిది 1కొరింథీ. 10:12ను నీకు జ్ఞాపకం చేయవచ్చు: ''తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను'' అని వ్రాయబడియుంది.

**నిజస్థితి, ఫలితాలు**

హెచ్చరిక యిచ్చిన తరువాత, ప్రభువైన యేసును, ఆయన శిష్యులును - భద్రమైన మేడగదిలోనుండి ''నిజ ప్రపంచం'' లోనికి వెళ్లారు-గెత్సెమనే తోటకు ప్రభువు, పేతురు, యాకోబు, యోహానులను వెంటబెట్టుకొని, తోట మధ్య భాగానికి వెళ్లినట్టున్నారు. ''మెలుకువగా ఉండి ప్రార్థన చేయుడని'' ఆయన వారికి చెప్పారు (41 వ.). అయితే వారు నిద్రపోయారు. పేతురు వినవలసిన సమయంలోనేమో మాట్లాడాడు, యిప్పుడు ప్రార్థించవలసిన సమయంలోనేమో నిద్రపోతున్నాడు. అతడు పడిపోయే స్థితిలో ఉన్నాడంటే, ఆశ్చర్యపోనక్కరలేదు!

అల్లరి చేసే జనుల గుంపు వచ్చింది, తన ముద్దుతో యూదా యేసును గుర్తు చూపించాడు. పేతురు సిద్ధంగా ఉన్నాడు: అతని కత్తి బయటికి వచ్చింది, ప్రధానయాజకుని యొక్క దాసుని చెవి తుంచి వేయబడింది (51 వ.; యోహాను 18:10). ప్రభువైన యేసు అతని వైపు చూచి, యిలా అన్నాడు. ''నీ కత్తి వరలో తిరిగిపెట్టుము; కత్తి పట్టుకొనువారందరు కత్తిచేతనే నశింతురు'' (52a వ.).

ఇప్పుడు పేతురుయొక్క ఆక్షేపణ ఎలాగుంటుందో ఊహించు: ''ప్రభువా, ఒక నిమిషం ఆగు. నేను నీకొరకు చస్తానని చెప్పాను - ఇదిగో నేను సిద్ధంగానే ఉన్నా! ప్రభువా, నా వెనుకకురా, నేను నిన్ను కాపాడుతా; వారు నిన్ను పట్టుకోవాలనుకుంటే, వారు యిటుగుండానే రావాలి'' అన్నట్టుంది. అయినా, యేసు-''పేతురూ, నీ కత్తిని పడవేయుమని అంటున్నారు''. ఇలాగున, పేతురు వాస్తవాలను ముఖాముఖిగా ఎదుర్కొవలసి వచ్చింది. తనకు తన మానవ సంకల్పముంది; అయితే అది తన యజమానుని సంకల్పం కాదు.

తరచుగా మనకు మన మానవ సంకల్పాలుంటాయి, కదా? మన కాపుదలకు మన మూలాధారాలు, భద్రతా ప్రదేశాలు - అవి మన యిండ్లు, లేక ఆస్తులే కావచ్చు; మన ఉద్యోగాలే కావచ్చు; మన ఆరోగ్య, బలములే కావచ్చు; మన వివాహాలు, జంటలు, బిడ్డలే కావచ్చు. అవన్నీ త్వరలో తీసివేయబడవచ్చు. పైగా అవి ఉంటే - సరిగా రక్షణలేని స్థితిలోనే మనం ఉండవచ్చు!

పేతురు యొక్క అహంభావం గాయపరచబడింది; అతడు బహిరంగంగా ప్రభువుచేత గద్దింపబడ్డాడు.

వాస్తవికత పేతురులో యింకిపోయే దానికి ఆరంభమయ్యింది. ప్రభువు అల్లరి మూఖచేత కొనిపోబడ్డారు. ఆయన ముందుగా తెలియజేసినట్టే - ''శిష్యులందరు ఆయనను విడిచి పారిపోయారు'' (56b వ.).

> యేసును పట్టుకొనినవారు ప్రధానయాజకుడైన కయపయొద్దకు ఆయనను తీసికొనిపోగా, అక్కడ శాస్త్రులును పెద్దలును కూడియుండిరి. పేతురు ప్రధానయాజకుని యింటిముంగటివరకు, ఆయనను దూరమునుండి వెంబడించి లోపలికి పోయి- దీని అంత మేమవునో చూడవలెనని బంట్రౌతులతో కూడ కూర్చుండెను (57-58 వచనాలు).

ప్రధానయాజకుని యింటికి యోహాను కూడా వెళ్లినట్టు యింకొక రచన చెప్పుతుంది (యోహాను 18:15).

ప్రభువైన యేసు తన శిష్యులతో వచ్చిన మార్గంలోనే ఈ అల్లరి మూఖ పట్టణంలోనికి తిరిగి వచ్చినట్టుంది. తోటలోనుండి వెలుపలికి వచ్చి, కిద్రోను వాగు దాటి, పట్టణంలోని ప్రధానయాజకుని యింటియొద్దకు చేరుకుంది. యోహాను ప్రధానయాజకునికి నెళవైన వాడైయున్నట్టు కన్పిస్తుంది (ఒక వేళ అతనితో యోహానుకు వ్యాపార సంబంధమైన వ్యవహారాలున్నాయేమో). మొత్తానికి యోహాను ప్రధానయాజకుని యింటి ముంగిటిలోనికి వెళ్ళాడు. తరువాత అతడు పేతురును లోనికి రప్పించాడు (యోహాను 18:16).

పేతురు దరిదాపు ఆ ఆవరణపు మధ్య భాగానికి వెళ్లినట్టున్నాడు. అక్కడ శీతాకాలపు చలి రాత్రులకు సంబంధించిన చలిమంట వేయబడినట్టు వేరే రచన చెప్పుతుంది. పేతురు అక్కడ చేరి ఆ జనానికి సంబంధించిన వాడుగా నటిస్తూ, చలికాచుకొన మొదలు పెట్టాడు. అసలు ప్రభువును బంధించి తీసికొని వెళ్లినదాని అంతమేమవునో చూడాలని పేతురు వెళ్లినట్టు మత్తయి 26:58లో చెప్పబడింది. తెరువబడిన తలుపులు కిటికీల గుండ జరుగుతున్న తీర్పును అతడు గమనిస్తున్నాడు కాబోలు!

మనం సాగిపోకముందు, అది సింహాల బోనులా ఉంది, ఆ స్థలంలో మరి ఏ యితర శిష్యుడు లేనట్టున్నాడు. యోహాను తప్ప మిగిలిన వారందరు చెల్లా చెదురయ్యారు. గనుక ప్రభువుతో పేతురు నిలుపుకున్న బంధానికి, అతని ధైర్యానికి కొంత గుర్తింపు నిద్దాం.

వాస్తవికత బ్రద్దలుకొట్టుకొంటూ, బయటపడింది. పేతురును, యోహానును లోపలికి రానిచ్చిన ఆ యింటి చిన్న బానిసవద్ద పేతురు పట్టుబడ్డాడు. (యోహాను 18:17). చిన్న బాలిక- పెద్ద, బలమైన జాలరివద్ద ఒక చిన్న ప్రస్తావన యిలా చేసింది: '' - నీవును గలిలయుడగు యేసుతో కూడా ఉంటివి గదా?'' (6a వ.)పేతురుకు యిక మంటనుండి కాదు, జనులగుంపునుండే వేడెక్కనారంభించింది; బలమైన మనిషి బాలికవద్ద ముక్కలౌతున్నాడు. ''అందుకతడు - నేనుండలేదు; నీవు చెప్పు సంగతి

నాకు తెలియదని అందరి యెదుట అనెను'' (70 వ.). పేతురు ప్రభువును ఎరుగనన్నది యిది తొలిసారి!

అతడు తిరిగి వెనుకకు వచ్చాడు, అంటే మంటను వదిలాడు, అటు చీకటిలోనికి వచ్చి, నడవలోనికి చేరుకున్నాడు. అయినా అతడు తప్పించుకోలేకపోయాడు. మరొక పనిపిల్ల అతన్ని కనుగొన్నది. నడవలోనుండి అతడు వెళ్లుతుండగా ఆ చిన్నది అతని చూచి, '' - వీడును నజరేయుడగు యేసుతో కూడ ఉండెనని అక్కడి వారితో చెప్పింది'' (71 వ.). ఈ సందర్భంలో లేఖనాలన్నీ ఒక చోట చేర్చితే. అక్కడ పలువురు ఈ విషయంలో జోక్యం పుచ్చుకొన్నట్టు కన్పిస్తుంది. కనీసం యిద్దరు ఆ చిన్న దాని మాటకు తాళం కొట్టినట్టు - అవును నీవు సరిగానే చెప్పావు! అని అన్నారు.

పేతురుకు చెమటల్లు పట్టుకొస్తున్నట్టున్నాయి. ''అతడు ఒట్టుపెట్టుకొని - నేనుండలేదు; ఆ మనుష్యుని నేనెరుగనని మరల చెప్పెను'' (72 వ.). ఈ సమయంలో, యూదులు సాధారణంగా ఉపయోగించుకునేది ఒట్టే! అది అపవిత్రతతో కూడినదై యుండనవసరంలేదు. తాను చెప్పేదేదో అది సత్యమన్నట్టు అతడు ఒట్టుపెట్టుకున్నాడు. ఆయనను ఎరుగనని అతడన్నది యిది రెండవసారి.

**విషాదాంతము-కన్నీరు**

వారు అతని మీద నిగాపెట్టారు. చిన్నగుంపు పోగయ్యింది. పేతురు చెవినరికిన వాని బంధువు వారిలో ఉన్నట్టున్నాడు. ''అక్కడ నిలిచియున్నవారు పేతురునొద్దకు వచ్చి - నిజమే నీవును వారిలో ఒకడవే; నీ పలుకు నిన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నదని అతనితో చెప్పిరి'' (73 వ.). పేతురు ప్రభువును కఠినంగా ఎరుగనని చెప్పడమే అతని భయానికి హేతువయ్యింది.

గలిలయుల స్థానిక భాష వ్యత్యాసంగా ఉంటుంది. వారు అస్పష్టంగా మాట్లాడే వారు. అనేక అక్షరాలు ఒకే విధంగా పలికేవారు, మరికొన్నింటిని ఉచ్చరించకుండా పోయేవారు. వారి యాసను తక్కిన యూదులు ఎంతగా అసహ్యించు కొనేవారంటే - యూదయ సమాజ మందిరాల్లో ఆశీర్వాదం ఉచ్చరించడానికి గలిలయులకు అనుమతి నిచ్చేవారేకారు. అందువలన, పేతురు తన నోరు తెరిచినప్పుడెల్లా అతడు తన నోటితో - రాయలు సీమవారు గోదావరి జిల్లాలవారి మధ్యను; లేక వారు, వీరి మధ్యను ఉన్నట్టు పట్టుబడుతున్నాడు (వ్యత్యాసమైన యాసమాటలు ప్రాంతీయతను పట్టిస్తాయి గదా?).

అందుకు పేతురు - ''ఆ మనుష్యుని నేనెరుగనని చెప్పి శపించుకొనుటకును ఒట్టుపెట్టుకొనుటకును మొదలు పెట్టాడు'' (74 వ). తన ఒట్టుతో చేపలుపట్టేవారి అసహ్యమైన భాషను కూడా మిళితం చేసియుండవచ్చు. ''లేదు, లేదు, లేదు, నేనతని ఎరుగను!'' అని పేతురు పెద్దగా కేకవేస్తున్నట్టున్నాడు. అలాగున, అతడు మూడవ

సారి ప్రభువును ఎరుగనన్నాడు.

ఈ సందర్భంలో లూకా ప్రత్యేకమైన సంగతిని సూచిస్తున్నాడు: ''అప్పుడు ప్రభువు తిరిగి పేతురువైపు'' చూచారట! (లూకా 22:61). ఒకవేళ ప్రభువు కిటికీ, లేక ద్వారం వైపు చూచారేమో. లేక తీర్పుకొనసాగుతున్న కొద్దీ, ఒక చోటునుండి మరియొక చోటుకు నడిపింపబడే సమయంలో ఆయన పేతురువైపు చూచారేమో. తనకు జరుగుతున్న వాటన్నిటికి మధ్య, పేతురుకు ఏమి జరుగుతుందో కూడా ప్రభువుకు తెలుసు.

తాను జరిగించినదేదో నిజంగా గ్రహించినప్పుడు, పేతురుయొక్క ప్రతిచర్య ఎలాగుందో గుర్తించు: ''వెంటనే కోడి కూసింది''. (నేరం జరిగిన స్థలాన్ని విడిచి) బయటికి వెళ్లాడు; సంతాపపడి యేడ్చాడు (74b-75b వ.). ఈ పాఠంలో రెండవ భాగానికి వెళ్ళేటప్పుడు ఈ దృశ్యాన్ని నీ మనస్సులో ఉంచుకో.

## మనకు కోడికూసినప్పుడు

మనలను మనమే మోసపరచుకోకుండ జాగ్రత్తపడదాం. పేతురు నిలిచిన చోట మన మందరం నిలిచిన వారమే. ''మోషే నిలిచిన చోట నేను నిలిచాను'' అని కీర్తిశేషులు ఫ్రెడ్ మెక్లంగ్ గారు అనేవారు. అందులో సినిమా కాంట్రాక్టును ఆయన ఎలా నిరాకరించారో చెప్పాడు. ఫరో యొక్క రాజ భవనాన్ని మోషే వదలుకొన్నట్టు, ఫ్రెడ్‌గారు సేవకుని జీవితం కొరకై ధన, ఘనతలను వదులుకొన్నారు. మోషే, ఫ్రెడ్లు- నిలిచిన చోట మనం నిలిచియుండకపోవచ్చుగాని, పేతురు నిలిచిన స్థలంలో మాత్రం మనం నిలిచింది ఖాయమే.

ఆరాధనా కార్యక్రమంలో - ''ప్రభువా, నేను నీవాడను'' అని పాడేటప్పుడు మనం బలవంతులంగా ఉన్నట్టు భావిస్తాం. మనం తోటి క్రైస్తవులతో కలిసియున్నాం గనుక జారిపోయే అవకాశం లేనట్టు మనం తలస్తాం. ప్రభువును ఎరుగనని ఎప్పుడైనా అంటావా? అని అడిగితే, ''ఎన్నడూ అనను'' అని నీవంటావ్! తరువాత మనం నిజ ప్రపంచంలోనికి వెళ్లతాం. శోధనలు మనలను శోధించినప్పుడు, గుంపులు మనచుట్టు గుమికూడినప్పుడు పట్టుదలతో చూచే చూపు మనలను తొందర పెట్టినప్పుడు, అది వేరే కథ! కదా?

పట్టుదలతో చూచే చూపులు జనులను ఏమి చేస్తాయో తెలియజేసే కొన్ని ఉదాహరణలను ఈ మధ్య చదివాను. చెవిటి పిల్లవాడు తక్కిన వారికి భిన్నంగా కనబడకుండేలా, శ్రవణ సహాయ యంత్రాన్ని ధరించుకోడట. దాదాపు గ్రుడ్డిపిల్ల గోడలకు గుద్దుకొంటూ, వస్తువులకు తగులుకొంటూ తన్నుతాను గాయపరచుకోడానికైనా యిష్టపడుతుందటగాని, తాను గుడ్డిదానిగా గుర్తింపబడ నిష్టపడదట. ఒక ప్రయోగంలో, ''పదమూడు - పందొమ్మిది'' మధ్య వయస్సువారు,

''అన్నిటికంటె చిన్నగీతను అన్నిటికంటె పెద్దగీత'' అని అన్నారట - ఎందుకంటే - అదే వయస్సులో ఉన్న తక్కినవారు దాన్ని అలా అన్నారు గనుక! ''అది (ఆ పసి వయస్సు) ఆ లేత వయస్సువారి సంగతిలే'', అది అందరి విషయంలో నిజంకాదు అని ఎవ్వరైనా అనవచ్చు. తమాషాగా లేకపోయినా, సరదా మాటలకు యితరులు నవ్వారు గనుక నీవుకూడా నవ్వావా? (ఏ పనైనా, యితరులు చేశారని నీవు చేసియుంటావా?)

మన సద్భావాలతో, వాస్తవికత మోదుకొన్నప్పుడు, మనం క్రీస్తును ఎరుగనంటాం. మన మాటలవలన ఆయన్ను ఎరుగననవచ్చు, క్రియలవలన ఎరుగననవచ్చు, లేక మాట్లాడవలసివచ్చి నప్పుడు మౌనంగా ఉండటం వలన కూడా ఆయనను మనం ఎరుగననవచ్చు. కొన్ని సార్లైతే, ఆయనను కేవలం ఎరుగనని ఒక్కసారి అనడం మాత్రమేకాదు - మనసాక్షి యొక్క వేదన లేకుండానే పలుమార్లు ఆయనను ఎరుగననవచ్చు. మనస్సాక్షిని ఎలా కొంతసేపు నిశబ్దంగా ఉంచగలమో అనేది ఆసక్తికరంగా ఉంటుంది. సీటు బెల్టులు ఎలా ఊడొస్తాయో జ్ఞాపకం చేసికో. కారుల్లోని ప్రయాణికులకు సీటు బెల్టులు పెట్టుకోమని జ్ఞాపకం చేసే శబ్ద యంత్రాలు ఉంటాయి. సీటు బెల్టులను తగిలించుకొనకపోతే అవి శబ్దం చేస్తూవుంటాయి. నా స్నేహితుల్లో అనేక మంది ఆ శబ్ద యంత్రాలను ద్వేషిస్తూ ఉంటారు. సీటు బెల్టు పెట్టుకోవాలనే ఆలోచన వారికుండదు. శబ్ద యంత్రం మోగడం వారికి యిష్టముండదు. గనుక ఆ శబ్ద యంత్రాన్ని పనిచేయకుండ చేసేస్తారు. అంటే, కొందరు ఆ శబ్దయంత్రం కనెక్షన్ తీసివేస్తారు; మరికొందరు సీటు బెల్టులను ఒకదాని కొకటి తగిలించి, దానిపైన వారు కూర్చుంటారు. ఏదో ఒక రూపంగా ఆ శబ్దయంత్రాన్ని నోరు మూయించారన్న మాట! మనలో కొంత మంది మనస్సాక్షిని అలాగే చేస్తారు. మనస్సాక్షియనేది- మన హెచ్చరికకై దేవుని అతి ప్రధానమైన ఏర్పాటైయుంది- అయితే దాన్ని మనం యిష్టపడం, గనుక ఏదోవిధంగా దాన్ని అలక్ష్యం చేస్తాం. దానితో కలుపబడిన బంధాన్ని ఊడదీసివేసి, మన దారిని మనం పోతాం.

మన మార్గంలో మనకు కోడి కూసేవరకు వెళ్లతాం - ఏదో ఒకటి సంభవించి, పాపం మనకు అర్థమయ్యేవరకు - అది ఒక స్నేహితుని మాటే కావచ్చు, లేక బైబిలు తరగతో, ప్రసంగమో, పాటో, ప్రార్థనో అయ్యుండవచ్చు. అది ఆరోగ్యం కోల్పోవడమైయుండవచ్చు. ఒకవేళ అది ఆర్థిక విపత్తే కావచ్చు. అది కుటుంబ సమస్య కూడా అయ్యుండవచ్చు. ఒకవేళ మన లోకమే కసాయి దుకాణంగా మారిపోవచ్చు. (ఏదో ఒక సంభవంవలన మనం మేల్కొల్పబడతాం).

అనేక రకాలైన కోళ్లు మనుష్యులను మేల్కొలిపినట్టు బైబిలు తెలుపుతుంది. తోటలో నడచిన దేవుని స్వరం ఆదాము హవ్వలను మేల్కొలిపింది. ''నీవే ఆ మనుష్యుడవు'' అంటూ నెళవైన ఒకడు దావీదును మేల్కొలిపాడు. చేప గర్భంలో అవసరంలేని సెలవు యోనాను మేల్కొలిపింది. తప్పిపోయిన కుమారుని

విషయంలో - ఆకలి బాధ, పందుల వాతావరణం యొక్కరోత అతని లేపినట్టుంది; అది మరి యింకా ఏదైనా కావచ్చు.

ఏది యేమైనాసరే, కోడి కూస్తుంది; దోషారోపణ చేసే మనస్సాక్షి - నీవు ''దోషివి, దోషివి'' - అంటూ గట్టిగా నొక్కివేస్తుంది. అప్పుడు - మనమేమి చేశాం? ఇది మనం ఎలా చేసియుంటాం? ''దేవుని యొద్దనుండి యింత దూరం తొలిగి పోయేలా మనలను మనం ఎలా విడిచిపెట్టుకున్నాం?'' అంటూ ఏడుస్తాం (అలా జరగడం వాస్తవంగా మనమేలుకొరకే).

(నీ జీవితంలో) కోడికూసిందంటే, మూడు ప్రతి చర్యలు జరిగించడానికది సమయమని నీవు నిశ్చయంగా ఎరిగియుండాలి!

### జ్ఞాపకం చేసికొనడానికది సమయం

మొదటిగా, అది జ్ఞాపకం చేసికొనే సమయం. ''యేసు చెప్పిన మాటను పేతురు జ్ఞాపకం చేసికొనెను'' అని వ్రాయబడింది (75a వ.). (దిద్దు బాటుకు యిది అత్యవసరం).

మనం బాగా బోధింపబడ్డాం. ఎలా జీవించాలో మనకు తెలుసు. ఎలా ప్రవర్తించాలోకూడా మన మెరుగుదుం. అయినా, ఎందుకో మొత్తానికి, మనం బోధింపబడిన దంతటిని - మన మనస్సుల్లో మూసివేస్తున్నాం. దాన్ని జ్ఞాపకం చేసికొనడానికి యిది సమయం.

జ్ఞాపకశక్తి ప్రాముఖ్యమయ్యింది. తప్పిపోయిన కుమారుడు తన తండ్రి ఇంటిని జ్ఞాపకం చేసికొన్నాడు. ''నీవు ఎక్కడ పడితివో ఆ సంగతిని జ్ఞాపకం చేసికొనుమని'' ప్రభువైన యేసు ఎఫెసు సంఘాన్ని హెచ్చరించారు (ప్రకటన 2:5).

నీవు జ్ఞాపకం చేసికొనవలసిందేమి? దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడని జ్ఞాపకం చేసికో. ప్రభువు తన శిష్యులను ప్రేమించినట్టు, వారు చెదరిపోతారని వారికి ముందుగా తెలియజేసినట్టు - సువార్తలో ఉన్న విశేషమంతటిని జ్ఞాపకం చేసికో - యేసు మరణం, సమాధి, పునరుత్థానాలను గూర్చి తన శిష్యులకు తెలిపినట్టు నీవు తిరిగివస్తే దేవుడు నిన్ను క్షమించునని జ్ఞాపకం చేసికో. ప్రభువైన యేసు చెప్పిన దానిలో యిదంతా యిమిడియుంది. తప్పిపోవడం అనేది నశింపజేసేది కాదు; దాన్ని మనం అలాగే వదలివేయకుండా ఉంటే-పడిపోవడమనేది అంతం కానేరదు. (పడిపోయినవాడు తిరిగిలేవకుండునా?)

### మారుమనస్సు పొందడానికది సమయం

రెండవది, కోడి కూసినప్పుడు, మారుమనస్సు పొందడానికది సమయం ''అతడు బయటకువెళ్లి సంతాపపడి యేడ్చెను'' (75b వ.) అని వ్రాయబడియుంది.

పేతురు ప్రభువు మీదగాని, ప్రజల నాయకుల మీదగాని, ఆర్థిక వ్యవస్థ మీదగాని, లోకపు పరిస్థితి విషయంలోగాని, జాలరులు ఎలా చూడబడ్డారనే విషయంలోగాని ఏవిధమైన కష్టం పెట్టుకోలేదు. పేతురుకున్న కష్టమంతా ఏమంటే - తానేమైయుండాలో అలా ఉండలేకపోయాడు, తానేమి చేయాలో అలా చేయలేకపోయాడు. అందుకే అతడు వేదనపడ్డాడు.

తరచుగా, పేతురుకు యూదాకు మధ్యగల భేదం చూపింప బడుతూ ఉంటుంది. యూదా ప్రభువును అమ్మివేసిన తరువాత, అతడు కూడా వేదన పడ్డాడు. అయినా, అతడు కన్నీరు విడిచినట్టు లేదు. పైగా అతడు వెళ్లి ఉరిపోసికొన్నాడు (మత్తయి 27:3). లోకసంబంధమైన దుఃఖానికిని, దైవచిత్తాను సారమైన దుఃఖానికిని వ్యత్యాసముంది (2కొరింథీ. 7:10). అది అనుతాపానికిని మారుమనస్సుకునూ ఉండే వ్యత్యాసమే!

కోడి కూసినప్పుడు అది సంతోషకరమైన సమయం కాదు. కోడి నోరు మూయించాలని దాని ముందు కొన్ని గింజలు వేయవచ్చు. దాని గొంతు నులిపివేయాలని నీవు శోధింపబడవచ్చు. అయితే, దేవుని దయా సంకల్పంలో, ''కోడి కూతలు'' నిన్ను మేల్కొల్పడానికినీ; నీ తిరుగుబాటు పరంపరలను నీవు చూడగలగడానికినీ; నీకు సహాయపడతాయి. అందువలన, కోడి కూసినప్పుడు, మారుమనస్సు పొంది, ''దేవా, మేము పాపం చేశాం. మా మనో వాక్కాయ కర్మల్లో మేము నిన్ను ఎరుగనన్నాం, అయితే మీ సహాయంతో మేలైన దానిని చేస్తామని'' చెప్పేలా మన హృదయాలు పగిలిపోవాలి! (తిరిగి ఆయనవైపు మరలాలి!)

### క్రొత్తగా రూపొందడానికది సమయం

మూడవ జ్ఞాపకానికి యిది మనలను తెస్తుంది. కోడి కూసినప్పుడు, నూతన పరచడానికది సమయం.

''పేతురు యొక్క కన్నీరు, కేవలం అనుతాపం కాకుండ, నిజమైన మారుమనస్సుకు నిదర్శనమని చెప్పడానికి ఆధారమేమి?'' అని అడుగుతావేమో! పేతురు ఆ తరువాత జరిగించిన పనులలో దీనికి జవాబు కన్పిస్తుంది. ప్రభువైన యేసు పేతురుకు మరో తరుణం అనుగ్రహించారు. దానిని అతడు సద్వినియోగం చేసికొన్నాడు.

వారు తొట్రిల్లి చెదరిపోతారని ప్రభువు తన శిష్యులకు తెలియజేసి నప్పుడే, ఆయన మూడవ దినమున లేపబడి, గలిలయలో వారిని కలిసికొంటానని వారికి తెలిపారు (మత్తయి 26:31-32). ప్రభువు మృతులలోనుండి లేచిన తరువాత, ఖాళీ సమాధి నొద్దకు వచ్చిన స్త్రీలతో ఒక దూత యిలా అన్నాడు; ''- త్వరగా వెళ్లి, ఆయన మృతులలోనుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి; ఇదిగో ఆయన

గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లుచున్నాడు, అక్కడ మీరు ఆయనను చూతురు'' (మత్తయి 28:7). గలిలయ సముద్రమునొద్ద యేసు తన శిష్యులను కలిసికొనినట్లు యోహాను 21 మనకు తెలియజేస్తుంది. అందులో ప్రత్యేకించి, ప్రభువైన యేసు పేతురును పలుమార్లు ప్రశ్నించిన సంగతి ఎరుకచేయబడింది.

> వారు భోజనముచేసిన తరువాత యేసు సీమోను పేతురును చూచి- యోహాను కుమారుడవైన సీమోనూ, వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా? అని అడుగగా అతడు- అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను; యేసు - నా గొర్రెపిల్లలను మేపుమని అతనితో చెప్పెను. మరల ఆయన- యోహాను కుమారుడవైన సీమోనూ, నన్ను ప్రేమించుచున్నావా? అని రెండవ సారి అతనిని అడుగగా అతడు- అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను; ఆయన - నా గొర్రెలను కాయుమని చెప్పెను. మూడవ సారి ఆయన- యోహాను కుమారుడవైన సీమోనూ, నన్ను ప్రేమించుచున్నావా? అని అతనిని అడిగెను. నన్ను ప్రేమించుచున్నావా అని మూడవసారి తన్ను అడిగినందుకు పేతురు వ్యసనపడి- ప్రభువా, నీవు సమస్తము ఎరిగినవాడవు, నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను. యేసు - నా గొర్రెలను మేపుము ... అని చెప్పెను (యోహాను 21:15-17).

ప్రభువును ఎరుగనని పేతురు ముమ్మారన్నాడు. దానిలో ప్రతిదానికి పేతురు యొక్క ప్రేమను నిర్ధారణ చేసేలా ప్రభువు కోరారు. తన పనిని జరిగించేలా, ఆయన యింకను పేతురుకు దానినప్పగిస్తున్న సంగతిని ప్రత్యేకంగా గుర్తించగోరతాను. ''నా గొర్రెలను మేపుమని'' ఆయన ముమ్మారు అతనితో అన్నారు. పేతురు భయంకరమైన పాపం చేసిన మాట వాస్తవమేగాని, దానితోనే అతడు అంతమొందలేదు. రెండవ తరుణంలో అతడు ముఖాముఖిగా ప్రభువును కలిసికొన్నాడు.

కృపా అవకాశాన్ని పేతురు బహుగా సద్వినియోగం చేసికొన్నాడు. అపొ. 2లో అతడు పెంతెకొస్తు దినాన ధైర్యంగా నిలిచి, యేసుక్రీస్తును గూర్చి ప్రకటించాడు. అపొ. 10లో, కొర్నేలియింట తాను ప్రసంగించుటకు అతడు కైసరయకు వెళ్లాడు.

కోడి కూసినప్పుడు, మనం అది అలాగే కావాలని కోరుకొనకపోతే, అది అంతమై యుండదు. సద్భావంతో మనం తిరిగినట్టయితే, అదే మంచి ప్రారంభంగా ఉండే అవకాశముంది. పతనపు అనుభవంలో నుండి పేతురు ప్రభువునకు ప్రయోజ నకరమైన- బలమైన వ్యక్తిగా రూపొందాడు. ఒక కట్టు కథ యిలా చెప్పబడింది: పేతురు తన తరువాత జీవితంలో - కోడికూత విన్న ప్రతిసారి- బోధించేటప్పుడు కొద్దిగా తడబడేవాడట; అతని ముఖం ఎర్రబారుతుందట. కాని తదనంతరం ఎక్కువ ఆసక్తితో, తీవ్రంగా తిరిగి దాన్ని ప్రారంభించి, ఎక్కువ ప్రేమను, ఎక్కువ గ్రహింపును కనుపరుస్తూ ఉండేవాడట!

ఒక తప్పు, అది ఎంతటి భయంకరమైనదైనా సరే, ఎలా కావాలని దేవుడు నీ

విషయమై కోరుతున్నాడో, అలా సిద్ధపడకుండ నిన్ను చెడగొడుతుందేమో జాగ్రత్త! ఎలాటి తప్పయినా నిన్ను చెడగొట్ట నవసరంలేదు. కోడి కూసినప్పుడు, అది మేల్కొనుటకు నీకు సహాయం! నూతన పరచబడుటకది సమయం; క్రొత్తగా రూపొందడానికది సమయం, గనుక తిరిగి లేచి, మహామహుడు కోరిన స్థితిలో నిలవడానికి ప్రయత్నించు.

## ముగింపు

దీనిలో ఒక ప్రాముఖ్యమైన పాఠముంది. దాన్ని మనం పోగొట్టుకునే అవకాశ ముంది. పేతురు యొక్క ఈ తొట్రుపాటును గురించి, సువార్త లేఖికులలో ప్రతి ఒక్కరు దాఖలు చేశారు. మార్కుకు సమ్మతించని పండితులు - మార్కు యొక్క రచన తొలిగా వ్రాయబడినట్టున్నూ, అది ఈ సంభవాన్ని ప్రచారంలోనికి తెచ్చి నట్టున్నూ అంగీకరిస్తారు. అంతేగాక, ప్రభువును గూర్చి పేతురు యిచ్చిన సందేశాన్ని అనుసరించినదే మార్కు రచనయని కూడా అంగీకరిస్తారు. పేతురు ప్రసంగాన్ని రచనలో పెట్టిందే మార్కు సువార్త యని పేపియస్ అన్నాడు. మరో విధంగా చెప్పాలంటే - పేతురు యొక్క పాపాన్ని ప్రచారం చేసికొన్నది పేతురేనన్నమాట! (అతడు దాన్ని దాచడానికి ఏ ప్రయత్నమూ చేయలేదన్నమాట!)

''నాకేమి సంభవించిందో దాన్ని మీతో పంచుకోవాలను కొంటున్నా; దానివలన మీరు మేలుపొందవచ్చు. ఈ పాఠాలు నేర్చుకొండి అని పేతురు అన్నట్టుంది: వీటిలో మొదటిది, ఎవడైనా పడిపోవచ్చు. పడిపోతానని నేను అనుకోలేదు. అయినా నేను పడ్డానే! - అలాగే నీవుకూడా పడవచ్చు. రెండవది, నీవు పడిపోతే, అది నీ అంతం కాదు. ప్రభువు దయాళుడు; ఆయన కృపగలవాడు. ఆయన నీకు మరో తరుణం అనుగ్రహిస్తారు. నీవు తిరిగి రావచ్చు.''

అది ఒకనికి కోడికూత వంటిదని నేను ఈ పాఠాన్ని భావిస్తున్నా! జీవితంలో తనకు సంభవించిన దానిని అతడెదుర్కొని, మారుమనస్సుపొంది తాను తిరిగి రాగలుగునట్టుగా యిది యివ్వబడింది. గనుక కేవలం పతనమే అంతంగా భావించి, నిరాశపడి, లోకంతో కలిసిపోనక్కరలేదు.

అపవాదికి యిష్టమైన రెండు అబద్ధాలున్నాయి. నీవు బదులియ్యనవసరం ఉంటే మాత్రం, ''నీవు తొందర పడుతున్నావ్. ప్రభువుకు విధేయత చూపించడంలో అంత తొందరపడనవసరంలేదు; అని వాడంటాడు''. నీవు ఘోరమైన దుష్కార్యం జరిగించిన తరువాత, అపవాది యొక్క రెండవ అబద్ధం: ''ఇక లాభంలేదు, లాభంలేదు'' - అనేది. అబద్ధాలకు జనకుని నీవు నమ్మవద్దు. ప్రభువుకు నీ హృదయం యివ్వడంలో తొందరపడడం అనేది జరుగనేరదు, నీ హృదయం తాకబడినప్పుడు, ఆయన యొద్దకు నీవు తిరిగి వచ్చుటలో లాభం లేకుండా పోయేది ఏదీ ఉండదు!

( గనుక తడవు చేయక ప్రభువు నొద్దకు వచ్చుటకు వేగిరపడు; తిరిగిరావాలని ఆయన నిన్ను కోరుతున్నారు).

పేతురు పాపం చేసినప్పుడు, ప్రభువు ఆగి అతనివైపు చూచారు. ఇప్పుడు ప్రభువు నీవైపు చూస్తున్నారు. అయితే అది మరి ఎలాటిచూపో? ఆనందదాయకమైన చూపేనా? లేక నిరాశా పూరితమైన చూపా? అది మరి ఏదైనా సరే, అది ప్రేమతోకూడిన దయాపూరితమైన చూపై యున్నదని నేను రూఢిగా నమ్ముతున్నా! ( నీవు జాగుచేయ పనిలేదు)

నీవు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందవలసి వచ్చినా; లేదా, పునరుత్థరింపబడవలసి వచ్చినా, నీవు నీ హృదయాన్ని ప్రభువుచే తాకబడడానికి సమ్మతిస్తావా? ( కృప పొంద నిష్టపడుతున్నావా? )